సాక్షి
వనపర్తి
మంగళవారం । 3 । అక్టోబర్ । 2023



ఆదాయ వాటాలపై దృష్టి

అభివృద్ధిని వదిలేసి.. ఆదాయ వాటాలపై దృష్టిపెట్టిందని కోదండరాం అన్నారు.

వివరాలు 8లో ▸



విద్యార్థినులకు అస్వస్థత

మన్ననూర్ గిరిజన పాఠశాలలోని విద్యార్థినులు మరోసారి అస్వస్థతకు గురయ్యారు.

వివరాలు 8లో ▸

గరిష్టం/కనిష్టం
31.4 /21.9

వాతావరణం

ఆకాశం రోజంతా మేఘావృతమై ఉంటుంది. ఓ మోస్తరు వర్షం కురిసే అవకాశం ఉంది. తేమ ఎక్కువగా ఉంటుంది.

న్యూస్‌రీల్

కోర్టు ఆవరణలో స్వచ్ఛభారత్



వనపర్తిటౌన్: హైకోర్టు ఆదేశాల మేరకు జిల్లా కోర్టు ఆవరణలో సోమవారం న్యాయమూర్తులు రజని, రవికుమార్, జానకి స్వచ్ఛభారత్ కార్యక్రమం చేపట్టారు. పరిసర ప్రాంతాలను శుభ్రపరిచి, చెట్లకు నీళ్లు పట్టి, చెత్తచెదారాన్ని ఊడ్చి శుభ్రం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ఇళ్లను ఎలా శుభ్రంగా ఉంచుకుంటామో పరిసర ప్రాంతాలను, కాలనీలను సైతం పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ఎక్కడ పరిశుభ్రత ఉంటుందో అక్కడ అభివృద్ధి జరుగుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు మోహన్‌కుమార్ యాదవ్, కృష్ణయ్య, న్యాయవాదులు కృష్ణయ్య, బాలనాగయ్య పాల్గొన్నారు.

రెవెన్యూ డివిజన్ కోసం సంతకాల సేకరణ



ఆత్మకూర్: గత వైభవాన్ని కోల్పోయిన ఆత్మకూర్‌ను డివిజన్‌గా ప్రకటించాలని కోరుతూ సోమవారం జేఏసీ ఆధ్వర్యంలో సంతకాల సేకరణ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా సభను ఏర్పాటు చేసి ప్రముఖ న్యాయవాదులు తిప్పారెడ్డి, గంగాధర్‌గౌడ్, అశోక్‌రావు, సామాజికవేత్తలు కుర్నిరవికాంత్, గడ్డం శ్రీనివాస్‌యాదవ్, ఆనంద్, ఖాజాపాష, చిన్ననర్సింహ మాట్లాడుతూ.. గత ఎన్నికల్లో చిట్టెం రామ్మోహన్‌రెడ్డిని గెలిపిస్తే ఆత్మకూర్‌ను రెవిన్యూ డివిజన్‌గా ప్రకటిస్తామని ఇచ్చిన హామీని నేటికి అమలు చేయకపోవడం విచారకరమని అన్నారు. ఆరేళ్ల క్రితం అఖిలపక్షం జేఏసీ ఆధ్వర్యంలో ఆత్మకూర్‌ను రెవిన్యూ డివిజన్‌గా ప్రకటించాలని కోరుతూ వంద రోజులు దీక్షలు చేపట్టిన నేపథ్యంలో అప్పటి ఎంపీ ఏపీ జితేందర్‌రెడ్డి హామీతో దీక్ష విరమించారు. అనంతరం అసెంబ్లీ ఎన్నికల్లో మంత్రి హరీష్‌రావ్ సీఎం కేసీఆర్‌చేత డివిజన్ ప్రకటన చేయిస్తామని, న్యాయం చేస్తామని ప్రచారసభలో హామీ ఇచ్చారు. అనంతరం ఈ విషయం మరుగున పడింది. ప్రస్తుతం సంతకాల సేకరణతో డివిజన్ ఉద్యమం మళ్లీ తెరపైకి వచ్చింది. దశల వారీగా ఉద్యమం చేపట్టేందుకు జేఏసీ ఆధ్వర్యంలో కార్యాచరణ రూపొందించినట్లు తెలిపారు. 4వ తేదీన మక్తల్‌లో చేపట్టే అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొనేందుకు వస్తున్న మంత్రి హరీష్‌రావు ఈ హామీపై స్పందించాలని డిమాండ్ చేశారు.

రూ.3.25 లక్షలకు లంబోదరుడి లడ్డూ

ఆత్మకూర్: పదహైదు రోజుల పాటు భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించి సోమవారం రాత్రి భక్తిపారవశ్యంతో గణనాథులను నిమజ్జనం చేశారు. స్థానిక బీసీకాలనీ, హనుమాన్ నగర్‌లతో పాటు మరో నాలుగు భారీ వినాయకుల నిమజ్జనోత్సవం నిర్వహించారు. బీసీకాలనీలోని లంబోదరుడి చేతిలోని లడ్డూను మాజీ వార్డు సభ్యుడు గడ్డమీది శ్రీనివాసులు, గాయత్రి దంపతులు రూ.3.25 లక్షలకు సవాల్ ద్వారా దక్కించుకున్నారు. బొడ్డెమ్మలు, కోలాటాలతో అలరించారు. అనంతరం జూరాల ప్రాజెక్టు ప్రధాన ఎడమ కాల్వలో వినాయకుల నిమజ్జనం నిర్వహించారు.

పత్తి రైతు చిత్తు

వర్షాలు లేక తగ్గిన దిగుబడి

- ఎకరాకు రూ.30 వేల పెట్టుబడి
- క్వింటాలు పత్తి రూ.6,500
- పక్క రాష్ట్రానికి వెళ్లినా లభించని ధర
- కౌలు రైతుల పరిస్థితి మరింత దారుణం



అమరచింత మండలం ధర్మాపూర్ శివారులో పత్తిపంటను ఏరుతున్న కూలీలు



అమరచింత: సాగు చేసిన పత్తిపంటకు దిగుబడి రాకపోవడం, పండించిన పత్తికి గిట్టుబాటు ధర లేకపోవడంతో పత్తి సాగుచేసిన రైతు తెల్లబోతున్నాడు. సరైన వర్షాలు సమయానికి పడకపోవడంతో పత్తి పంటలు ఎండుముఖం పట్టాయి. అనుకున్న విధంగా దిగుబడి వస్తుందని ఆశించిన పత్తి రైతు, దిగుబడి రాకపోవడం, ఆదిలోనే పత్తిపూతలు, పిందెలు రాలిపోవడం, తెగుళ్లు వ్యాపించడంతో ఈసారి పత్తి రైతు అపార నష్టాలు చవిచూడాల్సిన దుస్థితి నెలకొంది.

● వర్షాలు అనుకూలించి తమ కష్టాలు గట్టెక్కుతాయని ఆశ పడిన రైతులకు వాతావరణ పరిస్థితులు అనుకూలించకపోవడంతో పత్తి పంటలు పూర్తిస్థాయిలో దిగుబడిని కోల్పోయాయి. ఎకరానికి రూ.30 వేల నుంచి రూ.35 వేల వరకు పెట్టుబడితో పత్తిసాగు చేసిన రైతులకు చివరకు ఎకరానికి కేవలం మూడు క్వింటాళ్ల పత్తి మాత్రమే రావడంతో అపార నష్టానికి గురయ్యాడు. వర్షాధారంపై ఆధారపడి ఈ ఏడాది 16,206 ఎకరాల్లో పత్తి పంటను ఆయా మండలాల్లో సాగుచేసినట్లు వ్యవసాయ శాఖ అధికారుల నివేదికలో వెల్లడైంది. పత్తిపంటను సాగు చేసేందుకు పొలాలను కౌలుకు తీసుకున్న రైతులు, మరింతగా అప్పుల పాలైన పరిస్థితులు దాపురించాయి. గతేడాది పత్తికి అనుకూలంగా ధర ఉండటంతో, ఈ ఏడాది పత్తి పంటను సాగు చేయాలని ఆశపడిన రైతన్నకు మార్కెట్‌లో పత్తికి ధర లేకపోవడంతో ఆవేదనకు గురవుతున్నాడు.

జిల్లాలో పత్తిసాగు ఇలా...

మండలం	పత్తి సాగు ఎకరాల్లో
అమరచింత	4,760
ఆత్మకూర్	2,540
కొత్తకోట	850
మదనాపురం	1,570
పెద్దమందడి	1,553
చిన్నంబావి	0012
పెబ్బేరు	0029
శ్రీరంగాపురం	01
వీపనగండ్ల	0
ఘనపురం	2,330
గోపాల్‌పేట	730
పాన్‌గల్	10
రేవల్లి	1,210
వనపర్తి	411

వెంటాడిన కష్టాలు...

వానకాలంలో వానలు కురవకపోవడం, ఆపై ఎండలు విపరీతంగా ఉండటంతో పొలంలో విత్తిన పత్తి విత్తనాలు వాడుముఖం పట్టాయి. తీరా ఏదోలా పండిన పంటలకు తెగుళ్లు సోకడం, వైరస్‌లు వ్యాపించడంతో పంట కళ్లముందే ఎండిపోతుండటంతో వాటిని గొర్రెలు, పశువులకు మేతగా వదిలేశారు. రైతులకు ప్రకృతి సహకరించకపోవడంతో ఈ సారి పూర్తిస్థాయిలో పత్తి దిగుబడి తగ్గింది.

రాయిచూర్‌కు వెళ్లినా..

ఉమ్మడి జిల్లాలో పత్తి కొనుగోలు కేంద్రాన్ని గతంలో ఏర్పాటు చేసిన ప్రభుత్వం ఈ ఏడాది దృష్టి సారించలేకపోతుంది. పత్తిని అమ్ముకుందామని మార్కెట్‌లకు వెళ్లిన రైతులకు దళారులు ఇస్తున్న ధరలు ఆందోళనకు గురిచేస్తున్నాయి. క్వింటాలు పత్తికి రూ.6,000 నుంచి రూ.6,500 చెల్లిస్తుండటంతో తప్పని పరిస్థితుల్లో వాటిని అమ్ముకుంటున్నారు. మరికొంత మంది రైతులు తమ పత్తిని పక్క రాష్ట్రమైన కర్ణాటకలోని రాయిచూర్ మార్కెట్‌కు తీసుకెళ్లినా.. అక్కడ అదే ధరలు ఇస్తుండటంతో రవాణా భారం తగ్గించుకునేందుకు స్థానికంగా గ్రామాలకు వస్తున్న దళారులకు తమ పంటను విక్రయించుకుంటున్నారు.



పత్తిని షెడ్‌లో నిల్వ చేసిన రైతు

అమ్మకానికి రాయిచూర్‌కు వెళ్లినా..



పండిన పత్తిని అమ్ముకునేందుకు పక్క రాష్ట్రంలోని రాయిచూర్ మార్కెట్‌కు వెళ్లినా.. సరైన ధర రాలేదు. రవాణా ఖర్చులు భారమయ్యాయి. దీంతో స్థానికంగానే అమ్ముకునేందుకు వచ్చినా. మద్దతు ధరలేక పండిన పంటకు పెట్టుబడి రాక తల్లడిల్లుతున్నాం.

– హన్మంతు, మూలమళ్ల

నీరుకట్టినా దిగుబడి లేదు...



వర్షధారంపై ఆధారపడి సర్వే నంబర్ 124లో ఐదు ఎకరాల్లో పత్తిపంటను ఎకరానికి రూ.30 వేల పెట్టుబడితో సాగుచేశాను. వర్షాలు అనుకూలించకపోవడంతో బోరుబావితో పత్తిపంటకు నీటిని అందించినా.. అనుకున్న దిగుబడి రాలేదు. ఎకరానికి మూడు క్వింటాళ్ల పత్తి మాత్రమే దిగుబడి రావడంతో పూర్తిగా నష్టపోయాను.

– ఆనందరెడ్డి, పత్తి రైతు, అమరచింత

కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేశాం..

జిల్లాలో పత్తి కొనుగోలు కోసం మదనాపురం మార్కెట్ పరిధిలో అడ్డాకుల వద్ద జిన్నింగ్ మిల్‌లో కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేశాం. క్వింటాల్ పత్తికి ప్రభుత్వపరంగా రూ.7,020 చెల్లిస్తున్నాం. విషయాన్ని అన్ని మండలాల వారీగా రైతులకు వివరించేందుకు మార్కెట్‌లకు కరపత్రాలను పంపిస్తున్నాం. రైతులు దళారులను నమ్మి మోసపోవద్దు.

– స్వరణ్ సింగ్, జిల్లా మార్కెట్ మేనేజర్

'గాంధీ చూపిన మార్గంలోనే కాంగ్రెస్ పయనం'



గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళి అర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు

వనపర్తిటౌన్: గాంధీ చూపిన మార్గంలోనే ఆనాడు కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ దేశాన్ని అభివృద్ధి వైపు నడిపించిందని, ఇప్పుడు కేంద్రంలో అధికారంలోకి రాగానే అభివృద్ధి వైపు నడిపిస్తదని ఏఐసీసీ అబ్జర్వర్లు చంద్రశేఖర్ రెడ్డి, మంజుల అన్నారు. ఈ మేరకు సోమరం గాంధీజీ, లాల్ బహదూర్ శాస్త్రి జయంతి వేడుకలు పురస్కరించుకుని జిల్లా కేంద్రంలోని రాజీవ్ చౌక్ నుంచి గాంధీచౌక్, కమాన్, జిల్లా ప్రభుత్వ హాస్పెటల్, ఇందిరాపార్కు మీదుగా రాజీవ్ చౌక్ వరకు కాంగ్రెస్ పట్టణ వర్కింగ్ ప్రసిడెంట్ రాములు ఆధ్వర్యంలో సత్యమేవ జయతే పాదయాత్ర చేపట్టారు. గాంధీ చౌక్‌లోని గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. సత్యమే ఎప్పటికీ గెలుస్తుందని–నిలుస్తుందని ఆచరణలో నిరూపించిన గాంధీ సిద్ధాంతాన్ని ఎప్పుడూ అనుసరిస్తూ.. కాంగ్రెస్ ముందుకెళ్తుందన్నారు. కాంగ్రెస్‌కి అధికారమిస్తేనే ప్రజా సమస్యలు పరిష్కారమవుతాయన్నారు. డీసీసీ అధ్యక్షుడు రాజేంద్రప్రసాద్, నందిమల్ల యాదయ్య, శ్రీనివాస్‌రెడ్డి, శ్రీలత రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఇరువర్గాల పోటాపోటీ ర్యాలీలు..

వీపనగండ్ల: కాంగ్రెస్ పార్టీ సత్యమేవ జయతే పాదయాత్ర పురస్కరించుకుని సోమవారం మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీకి చెందిన జూపల్లి కృష్ణారావు, చింతలపల్లి జగదీశ్వర్‌రావు వర్గీయులు పోటాపోటీగా నిరసన ర్యాలీలు చేపట్టారు.

మంత్రి హరీశ్‌రావు పర్యటనకు పకడ్బందీ ఏర్పాట్లు

- కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్



సూచనలు చేస్తున్న కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్

వనపర్తి: రాష్ట్ర వైద్యఆరోగ్యశాఖ మంత్రి తన్నీరు హరీశ్‌రావు ఈ నెల 4న జిల్లాలో పర్యటించనున్నారని, ఈ నేపథ్యంలో ఏర్పాట్లు పకడ్బందీగా చేయాలని కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ సూచించారు. సోమవారం ఈ విషయంపై జిల్లా అధికారులతో ఆయన వెబ్ కాన్ఫరెన్స్‌లో మాట్లాడారు. మదనాపురంలో డబుల్‌బెడ్రూం ఇళ్ల ప్రారంభోత్సవం, కొత్తకోటలో 30 పడకల సీహెచ్‌సీ, పట్టణాభివృద్ధి కార్యక్రమాల శంకుస్థాపనలకు సంబంధించిన పర్యటన ప్రదేశాల్లో చేయాల్సిన ఏర్పాట్లను ప్రొటోకాల్ మేరకు చేపట్టాలన్నారు. హెలీప్యాడ్‌ను సిద్ధం చేయించాలని, ఫైర్ సేఫ్టీ హెలిక్యాప్టర్ వద్దనే ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు.

బతుకమ్మ చీరలు పంపిణీ చేయాలి..

రానున్న దసరా పండగ సందర్భంగా జిల్లాలో పంపిణీ చేయాల్సిన బతుకమ్మ చీరల విషయమై కలెక్టర్ మాట్లాడారు. మండలాలు, గ్రామాల వారీగా చీరల పంపిణీ కోసం షెడ్యూల్ తయారు చేసుకోవాలన్నారు. గ్రామాలకు అందజేయాల్సిన స్పోర్ట్స్ కిట్లను ముందస్తు ప్రణాళిక ప్రకారం పంపిణీ చేయాలన్నారు. మంత్రి పర్యటన, బతుకమ్మ చీరల పంపిణీ, స్పోర్ట్స్ కిట్స్ పంపిణీ విషయంలో ఏవైనా ఇబ్బందులు ఉంటే.. తన దృష్టికి తీసుకురావాలని సూచించారు.

తెలంగాణ వీరవనిత ఐలమ్మ

- వ్యవసాయ శాఖ మంత్రి నిరంజన్‌రెడ్డి



ఖిల్లాఘనపురం మండలం సోళీపురంలో సాకలి ఐలమ్మ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న మంత్రి నిరంజన్ రెడ్డి

ఖిల్లాఘనపురం: తెలంగాణ ధీరవనిత, తొలి భూ పోరాటానికి నాంది పలికిన వీరమాత ఐలమ్మ అని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి నిరంజన్‌రెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని సోళీపురంలో ఐలమ్మ నూతన విగ్రహావిష్కరణ కార్యక్రమానికి మంత్రి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. పాలకుర్తి విసునూరు దొరల దౌర్జన్యాలను ఎదురించిన వ్యక్తి ఐలమ్మ అన్నారు. ఆమె చేపట్టిన భూ పోరాటంతో మొదలుకొని, సాయుధ పోరాటం వరకు అనేక మంది అమరులయ్యారన్నారు. ఆమె నేటి, నాటి తరాలవారికి స్ఫూర్తి అన్నారు. తెలంగాణ ప్రభుత్వం ఆమె జయంతిని 2022 నుంచి అధికారికంగా నిర్వహించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ పద్మశ్రీ, బాలీశ్వర్‌రెడ్డి, రజక సంఘం జిల్లా అధ్యక్షుడు విజయ్‌కుమార్, వివిధ గ్రామాల రజక సంఘం నాయకులు పాల్గొన్నారు.

రాష్ట్రంలోనే అందమైన విద్యాలయం రేవల్లి కేజీబీవీ..

గోపాల్‌పేట: రాష్ట్రంలోనే అందమైన విద్యాలయంగా రేవల్లి మండల కేంద్రంలో నిర్మించిన కేజీబీవీ నిలుస్తుందని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి అన్నారు. సోమవారం ఆయన ఉమ్మడి గోపాల్‌పేట మండలంలో పర్యటించారు. ఈ సందర్భంగా 26 నిర్మాణాలకు శంకుస్థాపన, శిలాఫలకాలు వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. 22 ఎకరాలకు బోర్లు మంజూరు చేశామన్నారు. మొదటి పంట కోసం ఇప్పటికే మినీ ఎత్తిపోతల ఏర్పాటు చేశామని చెప్పారు. సామూహిక వ్యవసాయంతో అన్ని విధాలా రైతులకు మేలు జరుగుతుందన్నారు. మున్ననూరులో ఎస్సీ కార్పొరేషన్ కింద మంజూరైన బోర్లు తవ్వకానికి పూజలు చేశారు. 15 ఫార్మేషన్ రహదారులు, ఏడు బీటీ రహదారులు, 2 సీసీటీవీలు, ఒక సైడ్ డ్రైయిన్, 40 డబుల్ బెడ్రూం ఇళ్లు, 4 ప్రాథమిక ఉపకేంద్రాలు, ఒక కాంపౌండ్‌వాల్ నిర్మాణానికి శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అహింసా స్ఫూర్తిని యువత అనుసరించాలి



గాంధీ, లాల్‌బహదూర్ శాస్త్రి చిత్రపటాల వద్ద నివాళి అర్పిస్తున్న జెడ్పీచైర్మన్ లోక్‌నాథ్‌రెడ్డి, కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్

వనపర్తి: ఆయుధం లేకుండానే.. బ్రిటీష్ పాలకులను తరిమికొట్టి అసింహ అన్నిటి కంటే శక్తివంతమైన పోరాట సాధనమని మహాత్మాగాంధీ నిరూపించి, దేశానికి స్వాతంత్ర్యం తీసుకొచ్చారని జెడ్పీచైర్మన్ ఆర్.లోక్‌నాథ్‌రెడ్డి అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన గాంధీ, మాజీ ప్రధాని లాల్‌బహదూర్ శాస్త్రి జయంతి వేడుకలకు జెడ్పీచైర్మన్ ముఖ్యఅతిథిగా హాజరై వారి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడారు. అహింసా స్ఫూర్తిని నేటి యువత అనుసరించాలని కోరారు. అతి కొద్ది కాలం ప్రధానిగా పనిచేసిన లాల్ బహదూర్ శాస్త్రి దేశానికి చేసిన సేవ, అమల్లోకి తీసుకొచ్చిన నూతన సంస్కరణలను ఆయన గుర్తుచేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ మాట్లాడారు. స్వాతంత్ర్య పోరాటం అసింహతో చేయనారంభించిన మహాత్మా గాంధీని దేశం అనుసరించటం బ్రిటీష్ పాలకల్లో వణుకుపుట్టించిందని కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ చెప్పారు. దేశ రెండో ప్రధానిగా అత్యంత సమస్యల్లో ఉన్న దేశానికి తన మేధస్సుతో ఎన్నో ప్రణాళికలు రచించిన గొప్ప వ్యక్తి మాజీ ప్రధాని లాల్‌బహదూర్ శాస్త్రి అని కొనియాడారు. ఆయన తొలిసారిగా నినదించిన జై జవాన్.. జై కిసాన్ వాఖ్యం ఇప్పటికీ ఆయన్ను స్మరింపజేస్తోందన్నారు. సమాజం ఆర్థికంగా, వ్యవసాయ పరంగా, విద్యా, వైద్యరంగాల్లో అభివృద్ధి సాధించినప్పుడే.. దేశ అభివృద్ధి చెందినట్లు భావించాలన్నారు.

గాంధీజీ జీవితం ప్రతిఒక్కరికీ ఆదర్శం



నివాళి అర్పిస్తున్న ఎస్పీ రక్షితా కె. మూర్తి

జాతిపితా మహాత్మాగాంధీ జీవితం ప్రతిఒక్కరికీ ఆదర్శమని ఎస్పీ రక్షితా కె. మూర్తి అన్నారు. గాంధీ 154వ జయంతి సందర్భంగా ఎస్పీ కార్యాలయంలో గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. భారత జాతిపితా జయంతి సందర్భంగా ఐక్యరాజ్య సమితి ప్రకటన మేరకు ప్రపంచ వ్యాప్తంగా అహింసరోజుగా నిర్వహించుకోవడం గర్వించదగిన అంశంగా చెప్పుకోవచ్చన్నారు. సత్యం, అహింస, సత్యాగ్రహం అనే మూడు ఆయుధాలతో దేశానికి స్వాతంత్ర్యం తీసుకొచ్చిన మహనీయుడని కొనియాడారు. నేటియువత గాంధీజీ జీవన మార్గాన్ని అనుసరించాలని ఎస్పీ పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎస్‌బీ సీఐ మధుసూదన్, ఆర్ఐ శ్రీనివాస్, అప్పలనాయుడు, ఎస్ఐలు, ఆర్ఎస్ఐలు తదితరులు పాల్గొన్నారు.

నాణ్యమైన విద్యకు చర్యలు

- పాఠశాలల్లో బోధన పర్యవేక్షణకు సీపీడీ సెల్ ఏర్పాటు చేసిన ప్రభుత్వం
- పాలమూరు డైట్ కళాశాలకు 10 మంది ఉపాధ్యాయుల డిప్యుటేషన్
- ఉన్నతి, ఎఫ్ఎల్ఎన్ ప్రోగ్రాంల అమలు బాధ్యత అప్పగింత
- బడుల బలోపేతం.. మెరుగైన బోధనకు అవకాశం
- ఇప్పటికే బాధ్యతలు చేపట్టిన పలువురు టీచర్లు



మహబూబ్‌నగర్‌లోని రామయ్యబౌలి ప్రాథమిక పాఠశాలలో తరగతులు బోధిస్తున్న ఉపాధ్యాయురాలు (ఫైల్)

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టింది. ప్రభుత్వం ఒకటి నుంచి పదో తరగతి చదువుతున్న విద్యార్థులు చతుర్విధ ప్రక్రియలపై పూర్తిస్థాయిలో పట్టు సాధించే విధంగా ప్రభుత్వం పలు కార్యక్రమాలు చేపట్టింది. వీటి పర్యవేక్షణ, ఉపాధ్యాయులకు సలహాలు, సూచనలు ఇవ్వడం, క్షేత్రస్థాయిలో బోధనా తీరుపై రిపోర్టులు ఇవ్వడం కోసం సీపీడీ (కంటిన్యూవస్ ప్రొఫెషనల్ డెవలప్‌మెంట్) పేరుతో ఉమ్మడి జిల్లాస్థాయిలో ప్రత్యేక బృందాన్ని ప్రభుత్వం నియమించింది. పలు ప్రభుత్వ ప్రోగ్రాంలలో శిక్షణ తీసుకుని జిల్లాస్థాయిలో రీసోర్సుపర్సన్లుగా పనిచేసిన 10 మందిని డిప్యుటేషన్ కింద జిల్లా డైట్ కళాశాలకు బదిలీలు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. వీరు విధుల్లో చేరిన వెంటనే ఆయా బాధ్యతలు నిర్వహించనున్నారు. మూడు రోజులపాటు డైట్ కళాశాలలో ఛాత్రోపాధ్యాయులకు తరగతులను బోధిస్తారు. మిగతా మూడు రోజులు క్షేత్రస్థాయిలో పాఠశాలలను సందర్శించి లోటుపాట్లను పరిశీలిస్తారు.

ఉపాధ్యాయులు వీరే..

వనపర్తి జిల్లా నుంచి ఎస్ఏ కృష్ణమోహన్, మహబూబ్‌నగర్ ఎస్జీటీ ఎం.ప్రకాష్, ఎస్జీటీ నివేదిత, ఎస్ఏ కోటేశ్వరచారి, ఎస్ఏ రతంగాపాణి, గద్వాల నుంచి ఎస్జీటీ మురళీధర్‌రెడ్డి, నాగర్‌కర్నూల్ ఎస్ఏ శోభారాణి, నారాయణపేట ఎస్ఏ రమణారెడ్డి, ఎస్ఏ అనిత, ఎస్ఏ గీతలను మహబూబ్‌నగర్‌లోని డైట్ కళాశాలలకు డిప్యుటేషన్ ఇస్తున్నట్లు రాష్ట్ర విద్యాశాఖ అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. వీరిలో కొంతమంది ఇప్పటికే విధుల్లో చేరగా.. మిగతా వారు మరో వారం రోజుల్లో విధుల్లో చేరే అవకాశం ఉంది.

పర్యవేక్షణ బాధ్యతలు..

ప్రభుత్వం ప్రాథమిక పాఠశాలల్లో ఎఫ్ఎల్ఎన్ (ఫండమెంటల్ లిటరసీ న్యూమరసీ)ను తొలిమెట్టు పేరుతో విద్యార్థుల్లో అభ్యసనా సామర్థ్యాలు, చతుర్విధ ప్రక్రియలు నేర్పించేందుకు ప్రవేశపెట్టింది. అలాగే ప్రాథమికోన్నత పాఠశాలల్లో లిప్ (లర్నింగ్ ఇంప్రూమెంట్ ప్రోగ్రాం) ఉన్నతి పేరుతో నిర్వహిస్తున్నారు. ఇక పదో తరగతి విద్యార్థులకు లక్ష్య పేరుతో అభ్యాసన తరగతులను ప్రభుత్వం నిర్వహిస్తుంది. వీటిపై పూర్తిస్థాయిలో పర్యవేక్షణకు ప్రత్యేక యంత్రాంగం లేకపోవడంతో కార్యక్రమాలు అనుకున్న స్థాయిలో ముందుకు సాగడం లేదు. అందుకోసం సీపీడీ ప్రత్యేక యంత్రాంగాన్ని తీసుకువచ్చింది. వీరు వారంలో మూడు రోజుల పాటు పాఠశాలల్లో తనిఖీలు చేయడం, విద్యార్థుల సామర్థ్యాన్ని పరిశీలించడం, టీఎల్ఎంల నిర్వహణ, మోడల్ లెసన్ చూపించడం, ఫీల్డ్ లెవల్‌లో పరిస్థితిని ప్రభుత్వానికి రిపోర్టు ఇస్తారు. అలాగే బోధనలపై ఉపాధ్యాయులకు సలహాలు, సూచనలు చేయడం వంటివి చేస్తారు.

బలోపేతం అవుతాయి..



ఉమ్మడి జిల్లాలోని పలు సబ్జెక్టులకు సంబంధించిన 10 మంది ఉపాధ్యాయులకు ప్రత్యేక బాధ్యతలు అప్పగించింది. ఈ మేరకు వీరిని మహబూబ్‌నగర్‌లోని డైట్ కళాశాలకు డిప్యూటేషన్ ఇస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. వీరంతా సీపీడీ కార్యక్రమం ద్వారా పాఠశాలల్లో బోధన పరిశీలన, పర్యవేక్షణ, సలహాలు సూచనలు చేస్తారు. తద్వారా పాఠశాలల్లో నాణ్యమైన విద్య అంది ప్రభుత్వ బడులు బలోపేతం అవుతాయి.

– రవీందర్, డీఈఓ, మహబూబ్‌నగర్, నారాయణపేట

క్లుప్తంగా

రోడ్డు ప్రమాదంలో దివ్యాంగుడు మృతి

బిజినేపల్లి: మండలంలోని పాలెంకు చెందిన సుబ్బయ్యగూడెం సమీపంలో ప్రమాదవశాత్తు జరిగిన రోడ్డు ప్రమాదంలో రాంలాల్(42) దివ్యాంగుడు మృతిచెందాడు. ఈ సంఘటన సోమవారం ఉదయం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. రాంలాల్ తన భార్య గౌరీదేవితో కలిసి వనపర్తి నుంచి నాగర్‌కర్నూల్‌కు దివ్యాంగుల ద్విచక్ర వాహనంపై వెళ్తున్నారు. పాలెంలో సుబ్బయ్యగూడెం వద్దకు చేరుకోగానే కుక్క అకస్మాత్తుగా రోడ్డుపైకి వచ్చింది. దానిని తప్పించే క్రమంలో అదుపు తప్పి కిందపడ్డారు. ఈ ఘటనలో రాంలాల్‌కు తీవ్ర గాయాలై మృతిచెందాడు. భార్య గౌరీదేవికి స్వల్పగాయాలయ్యాయి. భార్య గౌరీదేవి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ రాములుయాదవ్ తెలియజేశారు.

వివాహిత ఆత్మహత్య


రేణుక(ఫైల్)

చారకొండ: మండల కేంద్రానికి చెందిన పగడాల రేణుక(37) ఆత్మహత్య చేసుకుని ఆదివారం రాత్రి మృతిచెందిన సంఘటన చోటుచేసుకుంది. చారకొండ ఎస్‌ఐ రవి తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మండల కేంద్రానికి చెందిన పగడాల రేణుక కొంత కాలంగా ఆర్థిక ఇబ్బందులతో తీవ్ర ఇబ్బందులకు గురవుతోంది. ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు చున్నీతో ఉరి వేసుకుని మృతిచెందినట్లు తెలిపారు. విషయం తెలుసుకున్న చారకొండ పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని సోమవారం పోస్టుమార్టం నిమిత్తం కల్వకుర్తి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతురాలికి భర్త, ఇద్దరు కుమారులు ఉన్నారు. మృతురాలి తల్లి లక్ష్మి, కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని వివరించారు.

సంతానం కలగడంలేదని.. వివాహిత ఆత్మహత్య

కేటిదొడ్డి: సంతానం కలగడంలేదని కలత చెందిన ఓ వివాహిత ఆత్మహత్యకు పాల్పడిన ఘటన కేటీదొడ్డి మండలం మల్లాపురంలో సోమవారం చోటుచేసుకుంది. ఎస్‌ఐ వెంకటేష్ వివరాల మేరకు.. మల్లాపురం గ్రామానికి చెందిన ఆంజనేయులు, బుజ్జమ్మకు కొన్నేళ్ల కిందట వివాహమైంది. వీరికి సంతానం కలగపోవడంతో మనస్పర్థలు చోటుచేసుకున్నాయి. ఈ క్రమంలో మనస్తాపానికి గురైన బుజ్జమ్మ (27) ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. సోదరుడు బాబు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

భర్తతో గొడవ పడి..

నవాబుపేట: భర్తతో గొడవ పడి భార్య ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలంలోని కొత్తపల్లిలో చోటుచేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. మక్తల్ మండలం గుడిగండ్లకు చెందిన అమృత(21)ను 8 నెలల కిందట కొత్తపల్లికి చెందిన గొల్ల కేశవులుకు ఇచ్చి వివాహం చేశారు. నాటి నుంచి కొత్తపల్లిలో కూలి పని చేసుకుంటూ జీవనం సాగిస్తుంది. ఆదివారం ఇంట్లో భర్తతో గొడవ పడి ఇంట్లో నుంచి వెళ్లిపోయింది. సమీపంలోని చెరువులో దూకి ఆత్మహత్యకు పాల్పడింది. గ్రామస్తులు భర్తకు సమాచారం ఇవ్వటంతోపాటు ఆయన అత్తామామలకు సమాచారం అందించారు. సోమవారం మృతురాలి తండ్రి కావలి హన్మంతు ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ పురుషోత్తం తెలియజేశారు.

వ్యక్తి బలవన్మరణం

పెబ్బేరు రూరల్: అనారోగ్య సమస్యలతో ఓ వ్యక్తి జీవితంపై విరక్తి చెందిన బలవన్మరణానికి పాల్పడ్డాడు. వనపర్తి పట్టణ ఎస్‌ఐ యుగేంధర్‌రెడ్డి తెలిపిన వివరాలు ఇలా.. పెద్దకొత్తపల్లి మండలం, యాపట్లకు చెందిన గొల్ల ఉల్లెందుల సత్యం (40) ఇరవై ఏళ్ల క్రితం వనపర్తి పట్టణంలోని పాత బజారుకు చెందిన లింగమ్మను వివాహం చేసుకుని ఇక్కడే ఉంటూ ఆటోడ్రైవరుగా పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. అతనికి ఇద్దరు కూతుర్లు, కుమారుడు ఉన్నారు. నాలుగేళ్ల నుంచి కడుపు నొప్పి వస్తుండేది. చికిత్స చేసుకున్నా తగ్గకపోవడంతో అన్న వెంకటస్వామికి సోమ వారం ఉదయం ఫోన్ చేసి కడుపునొప్పి భరించలేకపోతున్నా.. చనిపోతున్నానని చెప్పాడు. అతని అన్న వనపర్తికి వచ్చి భార్య లింగమ్మను అడుగగా చిట్యాలకు వెళ్తున్నాని చెప్పడంతో, చిట్యాల ప్రాంతంలో వెతుకగా రైస్‌మిల్లు వెనుక భాగంలో చెట్టుకు ఉరేసుకుని కనిపించాడు. అతనిని వెంటనే వనపర్తి ఏరియా ఆస్పత్రికి తీసుకెళ్లగా, అప్పటికే మృతి చెందాడు. మృతుడి అన్న ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

లైంగిక వేధింపులు?

జడ్చర్ల టౌన్: మండలంలోని ఓ ప్రముఖ ప్రైవేట్ కంపెనీలో మహిళా కూలీలు, ఉద్యోగులు లైంగిక వేధింపులు ఎదుర్కొంటున్నట్లు సోమవారం సాయంత్రం నుంచి సామాజిక మాధ్యమాల్లో ప్రచారం జరిగింది. 44వ నంబర్ జాతీయరహదారికి సమీపంలో ఉన్న కంపెనీలో ఇటీవల బదిలీపై వచ్చిన ఓ ప్రధాన అధికారి కూలీలు, ఉద్యోగులతో అసభ్యకరంగా ప్రవర్తిస్తున్నారని, లైంగిక వేధింపులకు పాల్పడుతున్నాడని ఇద్దరు మహిళల ఆడియోలు వైరల్ అయ్యాయి. ఈ విషయంలో ఎలాంటి ఫిర్యాదులు అందలేదని స్థానిక పోలీసులు తెలియజేశారు. విషయం తెలిసిన ఎస్పీ విచారణకు ఆదేశించినట్లు సమాచారం. ఈ మేరకు సోమవారం రాత్రి స్థానిక పోలీసులు కంపెనీలో విచారణ చేసినట్లు తెలిసింది.

అభివృద్ధిని వదిలేసి.. ఆదాయ వాటాలపై దృష్టి

- ఉమ్మడి పాలమూరులో సమస్యలు మరింత జటిలం
- ప్రభుత్వాలు ఇప్పటికైనా కృష్ణా నీటివాటా తేల్చాలి
- తెలంగాణ జనసమితి అధ్యక్షుడు ప్రొఫెసర్ కోదండరాం
- పాలమూరు అధ్యయన వేదిక 30 గంటల సత్యాగ్రహ దీక్ష ప్రారంభం


మాట్లాడుతున్న ప్రొఫెసర్ కోదండరామ్

పాలమూరు: ఉమ్మడి పాలమూరు జిల్లాలో ఇటీవల ప్రధాని నరేంద్రమోదీ, సీఎం కేసీఆర్ పర్యటించినా.. స్థానిక మౌలిక సమస్యలపై ప్రస్తావించకపోవడంపై విడ్డూరంగా ఉందని తెలంగాణ జనసమితి అధ్యక్షుడు ప్రొఫెసర్ కోదండరాం అన్నారు. పాలమూరు అధ్యయన వేదిక ఆధ్వర్యంలో ఉమ్మడి పాలమూరు జిల్లాలో నెలకొన్న సమస్యలతో పాటు దశాబ్దకాలంలో గడిచినా హామీలు, హక్కులు అమలు చేయని ప్రభుత్వ వైఖరిని నిరసిస్తూ సోమవారం ఉదయం టీటీడీ కల్యాణ మండపం ఎదుట 30 గంటల సత్యాగ్రహ దీక్షను ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రొ.హరగోపాల్‌తో కలిసి ఉమ్మడి జిల్లాకు సంబంధించి 91రకాల డిమాండ్ల పత్రాలను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తెలంగాణ వచ్చిన తర్వాత కేవలం కేసీఆర్ కుటుంబం మాత్రమే బాగుపడిందన్నారు. మిగిలిన తెలంగాణ ప్రజలను పట్టించుకోలేదన్నారు. తెలంగాణ అభివృద్ధిపై దృష్టి పెట్టకుండా రాష్ట్రానికి వచ్చే ఆదాయ వనరులలో మొత్తం వాటా వారే తీసుకుంటున్నారని విమర్శించారు. కేవలం హైదరాబాద్‌పై మాత్రమే దృష్టి సారించి.. ఇతర ప్రాంతాలను నిర్లక్ష్యం చేస్తున్నారన్నారు. కంపెనీలు, ఇసుక, మైనింగ్ ఇలా ప్రతి దాంట్లో వాటాలు తీసుకుంటున్నారన్నారు. మొదట కృష్ణానది నీటి వాటాలను ఈ ప్రభుత్వాలు తేల్చాల్సిన అవసరం ఉందని, ఆ నీటిని జిల్లా అభివృద్ధి కోసం ఉపయోగించాలన్నారు. దీంతో పాటు పాలమూరు జిల్లాను పలు రకాలుగా అభివృద్ధి చేయడానికి నిధులు కేటాయింపు సక్రమంగా జరగలేదన్నారు. ప్రొ.హరగోపాల్ మాట్లాడుతూ తెలంగాణ దేనికోసం అయితే పోరాడి సాధించుకున్నామో ఆ కల ఇప్పటికీ నేరవేరలేదన్నారు. ఉమ్మడి రాష్ట్రంలో పాలమూరు జిల్లాలో ఉన్న సమస్యలు ఇప్పుడు ఇంకా జటిలమయ్యాయన్నారు. పోలీస్ వ్యవస్థ పూర్తిగా ప్రజాప్రతినిధుల కనుసన్నల్లో నడుస్తున్నారని, భవిష్యత్‌లో ఉద్యమాలు లేకుండా పోయే పరిస్థితి వస్తుందన్నారు. పదేళ్లుగా జిల్లాలో ఉన్న ప్రధాన సమస్యలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లిన సమస్యలను పట్టించుకోవడం లేదని ప్రధానంగా తెలంగాణకు న్యాయంగా పంపిణీ చేయాల్సిన కృష్ణా నీటిని ఇప్పటి వరకు పంపిణీ చేయాలేదన్నారు. కార్యక్రమంలో ఉమ్మడి పాలమూరు అధ్యయన వేదిక కన్వీనర్ రాఘవాచారి, తెలంగాణ పీపుల్స్ జాక్ రవికొండలు, తెలంగాణ రాష్ట్ర పెన్షనర్ల సంఘం రాష్ట్ర కార్యదర్శి నర్సింగ్‌రావు, విజయ్, వనమాల, చంద్రశేఖర్, బిచ్చారెడ్డి, ప్రభాకర్, తిమ్మప్ప, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

వినాయక నిమజ్జనంలో అపశ్రుతి

- కేఎల్‌ఐ కాల్వలో ప్రమాదవశాత్తు పడి యువకుడి గల్లంతు
- పుట్టి సాయంతో వెతుకుతున్న పోలీసులు, జాలర్లు


కేఎల్‌ఐ కాల్వలో పుట్టి సాయంతో వెతుకుతున్న జాలర్లు


శివకుమార్(ఫైల్)

కొల్లాపూర్ రూరల్: మండల పరిధిలోని అంకిరావుపల్లి సమీపంలో నాగర్‌కర్నూల్ ప్రధాన రహదారి బ్రిడ్జి వద్ద సింగోటం రిజర్వాయర్‌కు అనుసందానంగా ఉన్న కేఎల్‌ఐ ప్రధాన కాల్వలో ప్రమాదవశాత్తు పడి యువకుడు గల్లంతయ్యాడు. కుటుంబ సభ్యులు తెలియజేసిన వివరాలు ఇలా ఉన్నాయి. కొల్లాపూర్ పట్టణంలోని పదో వార్డుకు చెందిన శివకుమార్(26) తన వార్డులో ఏర్పాటు చేసిన వినాయకుని నిమజ్జనం చేసేందుకు తమ బృందంతో కలిసి పట్టణంలో ఊరేగిపు చేశారు. సోమవారం తెల్లవారుజామున అంకిరావుపల్లి గ్రామ సమీపంలోని కేఎల్‌ఐ ప్రధాన కాల్వలో నిమజ్జనం చేసేందుకు వెళ్లారు. నిమజ్జనానికి ముందు శివకుమార్ కాల్వలో దిగేందుకు వెళ్లి కాలు జారి పడిపోయాడు. కాల్వ ఉధృతంగా ప్రవహిస్తుండంతో కొట్టుకుపోయి గల్లంతయ్యాడు. ఉదయం నుంచి పోలీసులు, జాలర్లు పుట్టి సాయంతో పొద్దు పోయే వరకు వెతికినా.. ఆచూకీ లభించలేదు. గల్లంతైన శివకుమార్‌కు తల్లిదండ్రులు, భార్య ఉన్నారు. కాంగ్రెస్ నాయకులు జూపల్లి కృష్ణారావు సంఘటన స్థలాన్ని పరిశీలించారు. చింతలపల్లి జగదీశ్వరావు కూడా బాధిత కుటుంబాన్ని పరామర్శించారు.

4న ఉమ్మడి జిల్లా యోగా జట్ల ఎంపిక

మహబూబ్‌నగర్ క్రీడలు: జిల్లాకేంద్రంలోని మెయిన్ స్టేడియంలో ఈనెల 4న ఉమ్మడి జిల్లా యోగా జట్ల ఎంపికలు నిర్వహిస్తున్నట్లు జిల్లా యోగా అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు కె.రాములు, బాల్‌రాజు సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. సబ్ జూనియర్, జూనియర్, సీనియర్ విభాగాల్లో ఎంపికలు ఉంటాయని పేర్కొన్నారు. ఎంపికల్లో పాల్గొనేవారు బోనఫైడ్, ఆధార్‌కార్డు, పాస్‌పోర్టు ఫొటోలతో హాజరుకావాలని కోరారు. ఎంపికైన జట్టు కరీంనగర్‌లో ఈనెల 11 నుంచి జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని ఆయన తెలిపారు.

యువకుడిని కాపాడిన పోలీసులు

శాంతినగర్: ఆత్మహత్యకు పాల్పడుతున్న వ్యక్తిని గుర్తించి పోలీసులు కాపాడిన ఘటన వడ్డేపల్లి మున్సిపాలిటీ పరిధిలోని శాంతినగర్‌లో సోమవారం చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే.. మానవపాడు మండలం కొర్విపాడుకు చెందిన తెలిగి పరశురాముడు ఇంట్లో గొడవపడ్డాడు. ఆత్మహత్య చేసుకోవాలనే ఉద్దేశంతో ఎవరికి చెప్పకుండా శాంతినగర్‌లోని కన్యకాపరమేశ్వరి ఆలయ సమీపానికి చేరుకున్నాడు. పరశురాముని బంధువులు 100 కాల్‌చేసి పోలీసులకు సమాచారం అందించారు. వెంటనే స్పందించిన హెడ్‌కానిస్టేబుల్ రాజవర్ధన్ రెడ్డి, కానిస్టేబుల్ మస్తాన్ యువకుడు ఉన్న స్థలానికి చేరకున్నారు. చేతిలో ఉన్న పురుగు మందు డబ్బాను తీసుకుని విసిరేశారు. అప్పటికే కొంత తాగడంతో శాంతినగర్‌లోని ఆస్పత్రికి తీసుకువెళ్లి ప్రథమ చికిత్స చేయించారు. బంధువులను రప్పించి మెరుగైన చికిత్స కోసం కర్నూలు ఆస్పత్రికి తరలించారు. ఎవరైనా ఆపదలో ఉన్నట్లు తెలిస్తే వెంటనే సమీపంలోని పోలీస్‌స్టేషన్‌కు, 100 నంబర్‌కు ఫోన్ చేసి సమాచారం అందిస్తే తక్షణసాయం అందుతుందని పోలీసులు తెలిపారు.

కోడి పందెల స్థావరాలపై పోలీసుల దాడి

నాగర్‌కర్నూల్ క్రైం: కోడి పందెల స్థావరాలపై పోలీసులు దాడి చేసి పలువురిని అదుపులోకి తీసుకున్న సంఘటన మున్సిపాలిటీ పరిధిలోని ఎండబెట్ల గ్రామ శివారులోని గుట్టల ప్రాంతంలో సోమవారం చోటుచేసుకుంది. ఎస్‌ఐ మహేందర్ తెలిపిన సమాచారం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. నాగర్‌కర్నూల్ పరిసర గ్రామాలకు చెందిన కొంత మంది వ్యక్తులు ఇంద్రకల్, ఎండబెట్ల గ్రామ సరిహద్దుల్లోని గుట్టల ప్రాంతంలో గుట్టుచప్పుడు కాకుండా కోళ్ల పందెలు ఆడుతున్నారు. సమాచారం అందుకున్న పోలీసులు కోళ్ల పందెలు ఆడుతున్న స్థావరాలపై దాడులు నిర్వహించారు. ఈ దాడిలో మూడు కోళ్లు, 7 ద్విచక్రవాహనాలు, రూ.9,800 నగదు, కోళ్ల పందెలకు ఉపయోగించే 2 కత్తులు, 5 సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. పెద్దపల్లికి చెందిన మద్దిలేటి, గుంతకోడురుకు చెందిన ఖాజామియా, శ్రీపురానికి చెందిన రాములు, సయ్యద్, నాగనూలుకు చెందిన బంగారయ్య, నాగర్‌కర్నూల్‌కు చెందిన రాములు, పెద్దముద్దునూరుకు చెందిన సంకి శేఖర్‌లను అరెస్టు చేసి స్థానిక పోలీస్‌స్టేషన్‌కు తరలించినట్లు ఎస్సై తెలియజేశారు. మరికొందరు పరారీలో ఉన్నారని, సంఘటనకు సంబంధించి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని వివరించారు.

రెండు యూనిట్లలో విద్యుదుత్పత్తి


పవర్‌హౌజ్‌లోకి చేరుతున్న వరదనీరు

ధరూరు/ఆత్మకూరు: జెన్‌కో జల విద్యుత్ కేంద్రంలో రెండు యూనిట్లలో విద్యుదుత్పత్తి కొనసాగుతున్నట్లు అధికారులు తెలిపారు. సోమవారం రాత్రి 7 గంటల వరకు ప్రాజెక్టుకు 8,500క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తుంది. నెట్టెంపాడు ఎత్తిపోతలకు 750, ఎడమ కాల్వకు 1,030, కుడి కాల్వకు 731, ఆర్డీఎస్ లింకు కెనాల్‌కు 150, సమాంతర కాల్వకు 900, భీమా లిఫ్టు–2కు 750 క్యూసెక్కులు ప్రాజెక్టు నుంచి 11,385 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటి సామర్థ్యం 9.657 టీఎంసీలు కాగా ప్రస్తుతం 9.316 టీఎంసీల నీరు నిల్వ ఉంది. ఎగువలో ఒక యూనిట్ ద్వారా 39 మెగావాట్లు, 97.923 ఎం.యూ., దిగువలో ఒక యూనిట్ ద్వారా 40 మెగావాట్లు, 106.263 ఎం.యూ. విద్యుదుత్పత్తిని చేపడుతున్నారు. ఎగువ, దిగువ జలవిద్యుత్ ఉత్పత్తి కేంద్రాల్లో ఇప్పటి వరకు 204.186 మిలియన్ యూనిట్ల విద్యుదుత్పత్తిని సాధించారు.

శ్రీశైలంలో 855.8 అడుగుల నీటిమట్టం..

దోమలపెంట: శ్రీశైలం జలాశయంలో సోమవారం 855.8 అడుగుల వద్ద 94 టీఎంసీల నీటి నిల్వ ఉంది. జూరాలలో విద్యుదుత్పత్తి చేస్తూ 7,879, సుంకేసుల నుంచి 2,264 మొత్తం 10,125 క్యూసెక్కుల నీటి ప్రవాహం శ్రీశైలం వస్తున్నాయి. 24 గంటల వ్యవధిలో పోతిరెడ్డిపాడు ద్వార 2వేలు, మల్యాల ఎత్తిపోతల నుంచి హెచ్‌ఎన్‌ఎస్‌ఎస్‌కు 1,550, రేగుమాన్‌గడ్డ నుంచి ఎంజీకేఎల్‌ఐకు 1,488 క్యూసెక్కుల నీటిని వదిలారు. జలాశయంలో 101 క్యూసెక్కుల నీరు ఆవిరైంది.

చేపలవేటకు వెళ్లి మత్స్యకారుడి మృతి


రాముడు (ఫైల్)

వీపనగండ్ల: చేపలవేటకు వెళ్లి మత్స్యకారుడు మృతి చెందిన ఘటన మండలంలోని కల్వరాలలో చోటుచేసుకుంది. గ్రామస్తుల వివరాల మేరకు.. కల్వరాలకు చెందిన సంగనమోని రాముడు సోమవారం గ్రామ సమీపంలోని ఆమడకుంట చెరువులో చేపలు పట్టేందుకు వెళ్లాడు. చేపలు పడుతున్న క్రమంలో కాళ్లకు వల చుట్టుకోవడంతో చెరువులో మునిగి మృతి చెందాడు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని బయటికి తీశారు. పోస్టుమార్టం నిమిత్తం వనపర్తి మార్చురీకి తరలించారు. మృతుడికి భార్య అలివేల, ఇద్దరు కుమారులు, కూతురు ఉన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్‌ఐ రవిప్రకాష్ తెలిపారు.

గిరిజన పాఠశాల విద్యార్థినులకు అస్వస్థత

- తీవ్ర కడుపునొప్పితో 12 మంది, శ్వాస సమస్యతో ముగ్గురు ఆస్పత్రిలో చేరిక
- గతనెల 14న ఇదే పాఠశాలలో 200 మందికి అస్వస్థత
- అధికారుల నిర్లక్ష్యం వల్లే అంటున్న విద్యార్థుల తల్లిదండ్రులు


పాఠశాలలో అస్వస్థతకు గురైన వారికి వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్లు

మన్ననూర్: స్థానిక గిరిజన ఆశ్రమ పాఠశాలలోని విద్యార్థులు మరోసారి సోమవారం అస్వస్థతకు గురయ్యారు. నాగర్‌కర్నూల్ జిల్లా మన్ననూర్‌లోని గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాలలోని విద్యార్థులు ఉదయం పాఠశాల నిర్వహణ తర్వాత విద్యార్థులు వసతి గృహంలో మధ్యాహ్న భోజనం చేశారు. కొంత సమయం తర్వాత ముగ్గురికి శ్వాస తీసుకోవడం ఇబ్బందిగా ఉందని ఆందోళన చెందడంతో వెంటనే సిబ్బంది సమీపంలోని పీహెచ్‌సీకి తీసుకెళ్లారు. మరో 12 మంది కూడా కడుపు నొప్పి రావడంతో అంబులెన్స్ సాయంతో వారిని అచ్చంపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అనంతరం డిప్యూటి డీఎండీహెచ్‌ఓ తారాసింగ్ ఆదేశాల మేరకు పీహెచ్‌సీ వైద్యాధికారి సుధాకర్ సమక్షంలో పాఠశాల ఆవరణలో వైద్య శిబిరం ఏర్పాటు చేసి స్వల్ప అస్వస్థతకు గురవుతున్న విద్యార్థులు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు, ఇంజక్షన్‌లు ఇచ్చారు. ఇదిలా ఉండగా గత నెల 14వ తేదీన కలుషిత ఆహారంతో 200 మంది అస్వస్థతకు గురికావడం విదితమే. ఈ క్రమంలో ఆందోళనకు గురైన తల్లిదండ్రులు తమ పిల్లలను ఇళ్లకు తీసుకువెళ్లారు. వారం రోజులుగా విద్యార్థులు తిరిగి పాఠశాలకు వస్తున్న క్రమంలో అదే ఘటన పునరావృతం కావడంతో మరోసారి పెట్టెలు సర్దుకుని ఇంటిబాట పట్టారు. డీటీడీఓ కమలేశ్వర్‌రెడ్డి పాఠశాలను సందర్శించి అక్కడే ఉన్న కొంతమంది విద్యార్థులతో మాట్లాడారు. మేము కూడా అదే ఆహారం, అవే నీళ్లు తాగాం మాకు మంచిగానే ఉందని విద్యార్థులు సమాధానం ఇచ్చారు. ఇద్దరు, ముగ్గురు మినహాయిస్తే గతంలో అస్వస్థతకు గురైన వారు ఇప్పుడు కూడా ఇబ్బంది పడడం జరిగిందని తెలిపారు. సాయంత్రం 6 గంటల వరకు విద్యార్థులు ఆరోగ్య పరిస్థితి నిలకడగానే ఉందని అచ్చంపేట ఆస్పత్రిలోని విద్యార్థుల వద్ద ఉన్న వార్డెన్ తిరుపతమ్మ తెలియజేశారు. అమ్రాబాద్ సీఐ ఆదిరెడ్డి పాఠశాల వద్ద పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు.

అధికారుల నిర్లక్ష్యం..

పేద విద్యార్థులపై అధికారులు పూర్తి నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని తల్లిదండ్రులు, గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. కలుషిత నీరు, ఆహారంతో విద్యార్థులు అస్వస్థతకు గురైన విషయం ఇప్పటి వరకు బహిర్గతం చేయకపోవడంపై ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అదేవిధంగా అధికారులు కొన్ని ఆహార ధాన్యాలు, తాగునీళ్ల షాంపిళ్లు తీసుకుపోయి ఇప్పటి వరకు సమస్యకు కారణాలను నిర్ధారించకలేకపోవడంలో అంతర్యం ఏమిటని విద్యార్థుల తల్లిదండ్రులు ప్రశ్నిస్తున్నారు.


విద్యార్థుల తల్లిదండ్రులతో మాట్లాడుతున్న డీటీడీఓ కమలేశ్వర్‌రెడ్డి

ప్లాస్టిక్ ఫ్రీ ఫారెస్ట్‌గా తీర్చిదిద్దాలి

- రూ.32 లక్షలతో ఏర్పాటుచేసిన జంగల్ సఫారీ వాహనాలు ప్రారంభించిన మంత్రి శ్రీనివాస్‌గౌడ్, ఎంపీ సంతోష్‌కుమార్
- రూ.2.74 కోట్లతో నిర్మించనున్న బర్డ్స్ ఎన్‌క్లోజర్‌కు భూమిపూజ

పాలమూరు: రాష్ట్రంలోనే అతిపెద్ద అర్బన్ ఎకో పార్క్‌ను ప్లాస్టిక్ ఫ్రీ ఫారెస్ట్‌గా తీర్చిదిద్దాలని, ఆ దిశగా ఇప్పటి నుంచే అడుగులు వేస్తూ అభివృద్ధి చేయాలని ఎంపీ సంతోష్‌కుమార్ అన్నారు. మహబూబ్‌నగర్ జిల్లాకేంద్రంలోని కేసీఆర్ అర్బన్ ఎకో పార్క్‌లో రూ.32 లక్షలతో ఏర్పాటు జంగల్ సఫారీ రెండు వాహనాల ప్రారంభంతో పాటు రూ.2.74 కోట్లతో నిర్మించనున్న బర్డ్స్ ఎన్‌క్లోజర్‌కు రాష్ట్ర ఎక్సైజ్ శాఖ మంత్రి శ్రీనివాస్‌గౌడ్‌తో కలిసి ఎంపీ సంతోష్‌కుమార్ సోమవారం భూమిపూజ చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఎంపీ మాట్లాడుతూ దేశంలోనే అతిపెద్ద అర్బన్ ఎకో పార్క్ ఏర్పాటు చేయడంతోపాటు 1.5 ఎకరాల్లో వేలాది పక్షులతో బర్డ్స్ ఎన్‌క్లోజర్ ప్రారంభించడం అభినందనీయమన్నారు. దేశంలోని ఏ ఇతర ఫారెస్ట్‌లకు తీసిపోని విధంగా కేసీఆర్ అర్బన్ ఎకో పార్క్ ఉందన్నారు. మంత్రి శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ భవిష్యత్‌లో అనేక ప్రాంతాల నుంచి పెద్దఎత్తున పర్యాటకులు తరలివచ్చేలా జంగల్ సఫారీని తీర్చిదిద్దుతామన్నారు. 26 వేల ఎకరాల్లో దేశంలోనే అతిపెద్ద జంగల్ సఫారీని ఆకట్టుకునేలా తీర్చిదిద్ది.. డిస్కవరీ చానల్ తరహాలో రెండు సఫారీ వాహనాలు ఏర్పాటు చేసినట్లు వివరించారు. అనంతరం జంగల్ సఫారీ వాహనంలో వాచ్‌టవర్ వరకు ప్రయాణించి, వాచ్‌టవర్ పైనుంచి అడవిని తిలకించారు.


జంగల్ సఫారీ వాహనాలు ప్రారంభిస్తున్న ఎంపీ సంతోష్‌కుమార్, మంత్రి శ్రీనివాస్‌గౌడ్ తదితరులు

ఉద్యానవన పీజీ ఎంట్రెన్స్‌లో ఉత్తమ ఫలితాలు

కొత్తకోట రూరల్: పెద్దమందడి మండలంలోని కొండాలక్ష్మణ్ బాపూజీ ఉద్యానవన కళాశాల విద్యార్థులు జాతీయస్థాయి పీజీ ప్రవేశ పరీక్షలో ఉత్తమ ఫలితాలు సాధించినట్లు కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ పిడిగం సైదయ్య తెలిపారు. జూనియర్ రీసెర్చ్ ఫెలోషిప్‌లో జి.అర్చన ఓబీసీ కేటగిరిలో 10వ ర్యాంకు, అర్షియా పర్వీన్ ఈడబ్ల్యూఎస్ కేటగిరిలో 16, రాధిక ఓబీసీ క్యాటగిరిలో 54వ ర్యాంకు సాధించారు. దేశంలోని ఉత్తమ విశ్వవిద్యాలయాల్లో వీరు పీజీ అడ్మిషన్ పొందనున్నట్లు డీన్ పేర్కొన్నారు. సీనియర్ రిసెర్చ్ ఫెలోషిప్‌లో పూల శాస్త్ర విభాగంలో అచ్యుతమానిక ఓబీసీ క్యాటగిరిలో 6వ ర్యాంక్, వి.నాగరాజు పండ్లశాస్త్ర విభాగంలో ఎస్టీ క్యాటగిరిలో 11వ ర్యాంక్, మాలోత్ సోనియా కూరగాయలశాస్త్రం ఎస్టీ క్యాటగిరిలో 14వ ర్యాంక్ సాధించారు. బీఎస్సీ హార్టికల్చర్ పూర్తి అనంతరం మోజర్ల ఉద్యాన కళాశాలలో 2016లో అడ్మిషన్ పొంది, 2020లో ఉత్తరబంగ కృషి విశ్వవిద్యాలయంలో పూలశాస్త్ర విభాగంలో ఎంఎస్సీ పూర్తి చేసిన పూజిత ఈ ఏడాది ఆలిండియా ఎస్‌ఆర్‌ఎఫ్ 8వ ర్యాంక్ సాధించినట్లు తెలిపారు. 2017లో కళాశాలలో ప్రవేశం పొందిన నందిని.. 2021లో నిమటాలజీ విభాగంలో బీహార్‌లోని రాజేంద్రప్రసాద్ కేంద్రీయ వ్యవసాయ విశ్వవిద్యాలయం ప్రవేశం పొంది, ఈ ఏడాది 2వ ర్యాంక్ సాధించిందని చెప్పారు. 2016 నుంచి 2020 వరకు ఉద్యాన కళాశాలలో చదివిన సీహెచ్ కావ్యకృష్ణ జెనెటిక్స్ అండ్ ప్లాంట్ బ్రీడింగ్ ఎస్‌ఆర్‌ఎఫ్‌లో ఓబీసీ క్యాటగిరిలో 13వ ర్యాంక్ సాధించినట్లు తెలిపారు. ర్యాంకులు సాధించిన విద్యార్థులను కళాశాల వైస్‌చాన్స్‌లర్ డాక్టర్ బి.నీరజాప్రభాకర్ అభినందించారు.

వలసల జిల్లా కాదు, కవుల జిల్లా

- సమాజ నిర్మాణంలో రచయితలది గొప్పపాత్ర
- జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ స్వర్ణ సుధాకర్‌రెడ్డి


డాక్టర్ జెల్ది విద్యాధర్‌రావుకు పురస్కారం అందజేస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ తదితరులు

స్టేషన్ మహబూబ్‌నగర్: పాలమూరు అంటే వలసల జిల్లా కాదని, కవుల జిల్లా అని జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ స్వర్ణ సుధాకర్‌రెడ్డి అన్నారు. సమసమాజ నిర్మాణంలో రచయితలది గొప్ప పాత్ర అని జిల్లా కేంద్రంలోని లిటిల్ స్కాలర్స్ పాఠశాలలోని కాళోజీ హాల్‌లో సోమవారం పాలమూరు సాహితీ పురస్కార ప్రదానోత్సవ కార్యక్రమంలో జెడ్పీ చైర్‌పర్సన్ ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. తెలంగాణ ఉద్యమంలో పాలమూరు కవులు తమదైన పాత్ర పోషించారన్నారు. నేడు సమాజంలో నెలకొన్న అసమానతలను రూపుమాపేందుకు కవులు విశేషంగా కృషి చేయాలన్నారు. సభకు అధ్యక్షత వహించిన జిల్లా కళాకారుల సంఘం అధ్యక్షుడు వి.మనోహర్‌రెడ్డి మాట్లాడారు. తెలుగు సాహిత్యంలో మేలిమి సాహిత్యాన్ని సృజిస్తున్న కవులకు ప్రతి ఏటా పాలమూరు సాహితీ పురస్కారాలను అందజేయడం అభినందనీయమని అన్నారు. పాలమూరు సాహితీ అధ్యక్షుడు డాక్టర్ భీంపల్లి శ్రీకాంత్ మాట్లాడుతూ.. తెలుగు సాహిత్యంలో సమాజాన్ని చైతన్యపరిచే కవిత్వాన్ని ఆవిష్కరిస్తున్న కవులకు 13 ఏళ్లుగా సాహితీ పురస్కారాలు అందజేస్తున్నట్లు తెలియజేశారు. అనంతరం 2022 సంవత్సరానికి 'అంతరంగపు భాష' కవితా సంపుటిని రచించిన డాక్టర్ జెల్ది విద్యాధర్‌రావుకు పాలమూరు సాహితీ పురస్కారంతో పాటు జ్ఞాపిక, రూ.5,116 నగదు అందజేశారు. కార్యక్రమంలో కాళోజీ అవార్డు గ్రహీత కోట్ల వెంకటేశ్వరరెడ్డి, ప్రముఖ విద్యావేత్త కె.లక్ష్మణ్‌గౌడ్, డాక్టర్ గుంటి గోపి, బోల యాదయ్య, వల్లభాపురం జనార్దన, ఖాజామైనొద్దీన్, పులి జమున తదితరులు పాల్గొన్నారు.

సీఎంగా కొనసాగే నైతిక హక్కు కేసీఆర్‌కు లేదు

- బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణ


మాట్లాడుతున్న డీకే అరుణ

గద్వాల: రాష్ట్రంలో కీలకమైన అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించేందుకు ప్రధాన మంత్రి వస్తే హాజరుకాని కేసీఆర్‌కు సీఎంగా ఉండే నైతిక హక్కు లేదని బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణ ధ్వజమెత్తారు. సోమవారం సాయంత్రం జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆమె మాట్లాడారు. రాష్ట్రానికి కేంద్రం ఎన్నో అభివృద్ధి పనులు మంజూరు చేస్తున్నా ఇంకా మాకు ఏమిచ్చావని ప్రశ్నిస్తుండడం సిగ్గుచేటన్నారు. అభివృద్ధిలో 2014కు ముందు దేశం 11వ స్థానంలో ఉండేదని, ప్రధాని మోదీ వచ్చాకా దేశం అభివృధి పథంలో నడుస్తూ ఐదవ స్థానానికి చేరుకుందని వివరించారు. రాష్ట్రాన్ని లూటీ చేసే విధంగా బీఆర్‌ఎస్, కాంగ్రెస్ పార్టీలు పోటీపడి హామీలు గుప్పిస్తున్నారని విమర్శించారు. ధనిక రాష్ట్రాన్ని అప్పులు పాలు చేసిన చరిత్ర కేసీఆర్‌ది అన్నారు. రాష్ట్రంలో పేపర్ లీకేజీలతో 30 లక్షల మంది నిరుద్యోగుల భవితవ్యం అగమ్యగోచరంగా తయారైందని ఆందోళన వ్యక్తం చేశారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వానికి నిరుద్యోగుల ఉసురు తగులుతుందన్నారు. కేసీఆర్ ప్రభుత్వానికి కౌంట్‌డౌన్ ప్రారంభమైందని, ప్రగతిభవన్‌లో కేసీఆర్ కుటుంబం మరో మూడు నెలలు మాత్రమే ఉంటుందని జోస్యం చెప్పారు. కాంగ్రెస్ ఆరు గ్యారంటీలు కాదు, 60 గ్యారంటీలు ప్రకటించినా ప్రజలు నమ్మే పరిస్థితి లేదన్నారు. సమావేశంలో గద్దం కృష్ణారెడ్డి, రాధాకృష్ణారెడ్డి, విష్ణువర్ధన్‌రెడ్డి, వెంకటేశ్వర్‌రెడ్డి, రాములు, శివారెడ్డి, కిష్టప్ప పాల్గొన్నారు.